ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6, కనిష్ఠం 23.7
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 20 జూలై 2024





ఎస్సారెస్పీకి వరద ఉధృతి

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద
- ప్రాజెక్టులోకి 17,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు
- జిల్లాలో సరాసరి 27.7 మి.మీ. వర్షపాతం

నిజామాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. జిల్లాతో పాటు నిర్మల్, మహారాష్ట్రంలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. రెండు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో వరద పెరుగుతోంది. ప్రాజెక్టులోకి 17వేల283 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను 1065.60 అడుగులకు నీటి మట్టాలు చేరాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.824 టీఎంసీలకు నీళ్లు చేరాయి. మహారాష్ట్రంలోని విష్ణుపురి ప్రాజెక్టులోకి పెద్దఎత్తున వరద వస్తుండటం వల్ల అది నిండగానే గేట్లు ఎత్తితే గోదావరి ద్వారా ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు.


అలుగు పారుతున్న జన్నేపల్లి చెరువు

జిల్లాలో కురుస్తున్న వర్షాలు..

జిల్లాలో ఐదు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వరకు 27.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా రుద్రూర్ మండలంలో 68 మిల్లీమీటర్ల వర్షం పడింది. అత్యల్పంగా ఆర్మూర్ మండలంలో 13.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షం పడగా జూన్ నుంచి ఇప్పటి వరకు 306.5 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 319.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని 14 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 15 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదు కాగా నాలుగు మండలాల్లో సరాసరికంటే తక్కువగా వర్షం పడింది. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో కూడా వరద నీళ్లు చేరుతున్నాయి. జిల్లాలో మొత్తం 996 చెరువులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు పడుతున్న వర్షాల వల్ల 18 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. జిల్లాలోని 30 చెరువుల్లో 75 శాతంకు పైగా నీళ్లు చేరగా 157 చెరువుల్లో 50 శాతానికి పైగా నీళ్లు వచ్చాయి. జిల్లాలోని 145 చెరువుల్లో 25 శాతం పైగా చెరువుల్లో నీళ్లు చేరగా 646 చెరువుల్లో మాత్రం 25 శాతంలోపే వరద నీళ్లు వచ్చాయి. గడిచిన కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలతో ఈ వరద వచ్చి చేరుతోంది. జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడితే చెరువులు నిండి అవకాశం ఉందని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో పెరుగుతున్న పంటల సాగు..

జిల్లాలో నైరుతిరుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో పంటల సాగు విస్తీర్ణ పెరుగుతోంది. జిల్లాలో పడుతున్న వర్షాల వల్ల కొన్ని చెరువులు, వాగుల్లో కూడా వరద వస్తుండటంతో రైతులు పెద్దఎత్తున పంటల సాగు మొదలు పెట్టారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో వరిసాగును కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం మొత్తం 5లక్షల 52వేల 128 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేయగా ఇప్పటి వరకు 4లక్షల 24వేల 418 ఎకరాల్లో పంటలను వేశారు. జిల్లాలో వ్యవసాయ శాఖ వేసిన వానాకాలం ప్రణాళికకు అనుగుణంగా 78 శాతం వరకు ఇప్పటి వరకు రైతులు పంటలను వేశారు. జిల్లాలో వర్షాలు పడుతుండటంతో వరిసాగును ఎక్కువగా చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా రైతులు ఎక్కువ మొత్తంలో వరినాట్లను వేస్తున్నారు. నిజాంసాగర్ నీటి విడుదలతో పాటు బోర్ల కింద ఈ పంటల సాగును కొనసాగిస్తున్నారు. గుత్ప, అలిసాగర్ నీటివిడుదల చేయకున్నా వర్షాలు పడుతుండటంతో ఎక్కువ మొత్తంలో వరినాట్లను వేస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం 4లక్షల 30వేల 550 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 2లక్షల 73వేల 623 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. నిర్ణయించిన లక్ష్యంలో ఇప్పటి వరకు 69 శాతం వరినాట్లను పూర్తి చేశారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే ఈనెలాఖరులోపు అంచనాల ప్రకారం వరినాట్లను రైతులు వేయనున్నారు. వరికి అవసరమైన ఎరువులను కూడా అందుబాటులో ఉంచడంతో రైతులు ఈ పంటల సాగు కొనసాగిస్తున్నారు. ఈ వానాకాలంలో రైతులు మొక్కజొన్న ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. గత సంవత్సరం కంటే భిన్నంగా 42వేల ఎకరాల్లో మొక్కజొన్నను వేశారు. గత కొన్నేళ్లుగా సోయా దిగుబడి తగ్గుతుండటం వల్ల ఈ దఫా 34,550 ఎకరాల్లోనే పంటను వేశారు. జిల్లాలో పసుపు సాగు కూడా ఈ దఫా 24,262 ఎకరాల్లో వేశారు. ఇవేకాకుండా పెసర, కందులు, మినుములతో పాటు ఇతర పంటలను రైతులు వేశారు. ఇవేకాకుండా కూరగాయల సాగు కూడా ఎక్కువ మొత్తంలో రైతులు కొనసాగిస్తున్నారు.


ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

వైద్య, విద్య రంగాల పనితీరులో మార్పు కనిపించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మోర్తాడ్, జూలై 19: వైద్య, విద్యరంగాల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించేలాగా అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, గాండ్లపేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని లెబోరేటరి రూం, అపరేషన్ థియేటర్, ఇన్‌పెషెంట్ వార్డు, ఆక్సిజన్ ప్లాంట్, లెబర్‌రూం, మెటర్నటీ వార్డు, రోగులు, భోజనం తయారు చేస్తున్న కిచెన్‌రూం, వ్యాక్సినేషన్ గదిని, తదితర వాటిని సందర్శించారు. 30 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో ప్రతీరోజు రోగులు సందర్శిస్తారని, ఎంత మంది ఇన్‌పేషెంట్‌లుగా చేరుతున్నారని, సరిపడా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా? అని వైద్యాధికారులను అడిగితెలుసుకున్నారు. పాముకాటుకు గురైన వారికి స్థానికంగా చికిత్స అందిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరుగుతున్నాయా అని ప్రశ్నించగా సాధారణ ప్రసవాలను స్థానికంగా నిర్వహిస్తున్నామని, సిజేరియన్ చేయాల్సిన కేసులను ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ లక్ష్మీ వివరించారు. పాముకాటుకు గురైన వారికి కూడా ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉందని, సరిపడా మందులు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరుకుపోయి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ పరిసరాల శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన భవనంలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నందున స్పెషలిస్టు డాక్టర్‌ల నియామకానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఆసుపత్రికి మార్చురి మంజూరు అయినందున వెంటనే నిర్మాణం ప్రారంభించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం గాండ్లపేట ప్రైమరీ స్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే పనులను పరిశీలించారు. పనులు పూర్తయినందున ఎంబీ రికార్డులు పూర్తి చేసి సమర్పించాలని అన్నారు. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారా ? అని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. అనంతరం మోర్తాడ్ శివారులో వన మహోత్సవంలో భాగంగా కలెక్టర్ రాజీవగాంధీ హన్మంతు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, జిల్లా వైద్యాధికారి శివశంకర్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



ఘనంగా బోనాల పండుగ

నిజామాబాద్ అర్బన్, జూలై 19: నగరంలోని మారుతినగర్‌లోగల స్నేహసొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్‌లో శుక్రవారం బోనాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దిశ ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు. స్నేహసొసైటీ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేస్తుందని, దాంట్లో భాగంగా మహిళా సెక్స్‌వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లతో పనిచేస్తూ ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లారు. సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు

- కోటగిరి, నందిపేట మండలాల్లోని మిల్లుల్లో కొనసాగిన తనిఖీలు
- మూడు సీజన్‌లో కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని రైస్‌మిల్లుల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు కొనసాగిస్తున్నారు. మూడు సీజన్‌లో ఇచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్నారు. ధాన్యం నిల్వలకు అనుగుణంగా వివరాలను స్వీకరించడంతో పాటు ఇచ్చిన ధాన్యం లేని మిల్లులకు నోటీసులను జారీ చేస్తున్నారు. నిర్ణీత సమయంలో మిల్లింగ్ చేయడంతో పాటు ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అందించాలని ఆదేశిస్తున్నారు. నిబంధనలు పాటించని మిల్లులపై కేసులు నమోదు చేస్తున్నారు. శుక్రవారం కోటగిరితో పాటు నందిపేటలోని కొన్ని రైస్‌మిల్లుల్లో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల కోసం సిద్ధిపేట పౌరసరఫరాల అధికారులతో పాటు కామారెడ్డి అధికారులకు చెందిన బృందాలను జిల్లాకు పంపించారు. జిల్లాలో గడిచిన పది రోజుల్లో 15మిల్లుల వరకు తనిఖీ చేశారు. ఇవన్నీ బడా రైస్‌మిల్లులు కావడంతో పాటు ఆయా అసోసియేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నేతలకు సంబంధించిన మిల్లులు కావడంతో చర్చనీయాంశం అవుతుంది. జిల్లా అధికారులు లేకుండా రాష్ట్రస్థాయి పౌరసరఫరాల శాఖకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన పౌరసరఫరాలకు చెందిన అధికారులను జిల్లాకు పంపిస్తున్నారు. ఈ అధికారులకు ర్యాండమ్‌గా మిల్లులను కేటాయిస్తూ వాటిలో తనిఖీలు చేసే విధంగా చూస్తున్నారు. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలను చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

మిల్లర్లలో మొదలైన ఆందోళన

జిల్లాలో కొన్ని రోజులుగా రైస్‌మిల్లుల్లో తనిఖీలు కొనసాగుతుండటంతో మిల్లర్లలో ఆందోళన మొదలైంది. మూడు నెలల ముందు పలు మిల్లుల్లో అధికారులు తనిఖీలు చేపట్టి సుమారు 220కోట్లకు పైగా ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దాన్ని రాబట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ధాన్యం నిల్వలు లేని మిల్లులకు అంతే మొత్తంలో ఫైన్ 25శాతం కలిపి వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు.



కోటగిరిలో గోదాంను తనిఖీ చేస్తున్న అధికారులు

అసోసియేషన్ ద్వారా ప్రయత్నాలు

తనిఖీలలో ఎక్కువ మొత్తంలో తేడాలు బయటపడుతుండటంతో మిల్లర్లు అసోసియేషన్ ద్వారా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా బియ్యాన్ని అందిస్తామని లేకుంటే ఇతర జిల్లాల మాదిరిగా డబ్బులు చెల్లిస్తామని ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తున్నారు. అధికార పార్టీ నేతల ద్వారా ప్రయత్నాలను కొన సాగిస్తున్నారు. జిల్లాలో ఇతర మిల్లుల్లో కూడా ఎక్కువ మొత్తంలో తేడాలు ఉండటం మూడు సీజన్‌లో కేటాయించిన ధాన్యంకు సంబంధించి వివరాల ఆధారంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తేడాలున్న మిల్లర్లు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని మిల్లుల్లో ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు కొనసాగుతున్నట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు. మరికొన్ని రోజుల పాటు ఈ తనిఖీలు కొనసాగే అవకాశం ఉందని వారు తెలిపారు.



టీయూ పై పట్టింపు ఏదీ?



- వరుస ఘటనలతో టీయూ అప్రతిష్ఠపాలు
- పర్యవేక్షణ కొరవడి గాడితప్పుతున్న పాలన
- రెగ్యులర్ వీసీ లేక వర్సిటీలో పేరుకుపోతున్న సమస్యలు
- టీయూ బాలుర, బాలిక హాస్టళ్లలో సమస్యల తిష్ఠ
- పట్టించుకోని అధికారులు

డిచ్‌పల్లి, జూలై 19: తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని పట్టించుకునేవారు లేరు. రెగ్యులర్ వీసీలేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. విశ్వవిద్యాలయంలో రోజురోజుకూ జరుగుతున్న వరుస ఘటనలు అప్రతిష్ఠపాలు జేస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి వర్సిటీలో పాలన గాడితప్పుతోంది. ఏడాదిన్నరగా రెగ్యులర్ వీసీ లేకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. గురువారం రాత్రి బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు అందించే రాత్రి భోజనంలో బొద్దింక రావడం కలవరం లేపింది. విద్యార్థినులు ఆందోళనలకు సిద్ధమవుతుండగానే హాస్టల్ చీఫ్ వార్డెన్ మహేందర్ రెడ్డి పురుగులు వచ్చిన భోజనం బయట పడేయించాడు. మళ్లీ భోజనం తయారు చేసి విద్యార్థినులకు అందించారు. దీంతో హాస్టల్ విద్యార్థినులు శాంతించారు. అదే విధంగా గత నెల 22న బాలుర హాస్టల్ లో అల్పాహారంలో బల్లి దర్శనమిచ్చింది. ఈ విషయం బయటికి పొక్కకుండా వర్సిటీ అధికారులు జాగ్రత్తలు తీసుకొని విద్యార్థులను హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా.. అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. అలాగే వర్సిటీలో సెక్యూరిటీ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు వారాల క్రితం బాలుర హాస్టల్‌లో బాలికకు వసతి కల్పించిన ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. వర్సిటీకి సంబంధంలేని బాలిక.. బాలుర హాస్టల్‌కు వచ్చిందంటే సెక్యూరిటీ విభాగం ఏ మేరకు పనిచేస్తుందో ఇట్టే అర్థమవుతోంది.


బాలికల హాస్టల్ వంట మనుషులను విచారిస్తున్న వర్సిటీ అధికారులు

విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం..

వర్సిటీలోని అన్ని విభాగాల సిబ్బంది సమయ పాలన పాటించకుండా విధులకు హాజరుకావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే యూనివర్సిటీలో ఎలక్ట్రీషియన్ విభాగంలో సిబ్బంది ఉన్నా.. కనీసం ఫ్యాన్లు, లైట్లు బిగించకుండా కాలయాపన చేస్తున్న సందర్భాలు కనబడుతున్నాయి. శుక్రవారం టీయూలోని సెంట్రల్ లైబ్రేరీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కరెంట్ మీటర్‌లో మంటలు వ్యాపించాయి. వర్షాకాలంలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. టీయూలోని బాలురకు న్యూ హాస్టల్‌తో పాటు, పాత హాస్టల్ కూడా ఉంది. అలాగే బాలికల కోసం మరో హాస్టల్ ఉంది. అయితే హాస్టల్ సిబ్బంది శుభ్రత పాటించకపోవడంతో హాస్టల్ చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. హాస్టల్ సిబ్బంది వంటలు తయారు చేసి తమ ఇళ్లకు వెళ్లిపోతారు. కనీసం విద్యార్థులు భోజనాలు ముగించే వరకు కూడా ఉండకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపంగా కనబడుతోంది. వర్సిటీలో ఇంత జరుగుతున్నా.. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గాని, అధికారులు గాని పట్టించుకోకపోవడం శోచనీయం. కాగా, ఇన్‌చార్జి వీసీగా ఇటీవల నియామకమైన సందీప్‌కుమార్ సుల్తానీయ ఇంతవరకు వర్సిటీని సందర్శించలేదు. సమస్యలపై దృష్టిసారించలేదు. దీంతో వర్సిటీలో అటెండర్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.


బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించిన భోజనంలో పురుగులు

జరిగిన ఘటనపై చర్యలు తీసుకుంటాం : టీయూ రిజిస్ట్రార్

తెలంగాణ విశ్వవిద్యాలయం బాలికల హాస్టల్ భోజనంలో జరిగిన వరుస ఘటనలను తీవ్రంగా పరగణించిన రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఆరతి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొ.అపర్ణ, చీఫ్ వార్డెన్ మహేందర్‌తో కలిసి త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేశారు. కేర్ టేకర్లు 24గంటల పాటు అందుబాటులో ఉండేలా ఆదేశించారు. ఐదుగురు సీనియర్ మహిళా ప్రొఫెసర్లతో మానిటరింగ్ కమిటీని నియమించామన్నారు. హాస్టల్‌లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి రిజిస్ట్రార్ సూచించారు.

'మీ సేవ ఎంపికలో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి'

బోధన్‌రూరల్, జూలై 19 : మీసేవ ఎంపికలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీసేవ ఎంపికలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. గ్రామ సంఘాల ద్వారా మీసేవ కేంద్రాలను నిర్వహించుకోవడానికి స్త్రీనిధి నుంచి 2.50 లక్షల రుణాన్ని ప్రభుత్వం ఇవ్వనుందని తక్షణమే జిల్లాలో అర్హులైన నిరుద్యోగ దివ్యాంగులను గుర్తించి మీసేవ కేంద్రాల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆమె వెంట దివ్యాంగులు తదితరులున్నారు.

సెల్‌ఫోన్లు దొంగిలించిన వ్యక్తికి నాలుగు నెలల జైలు

రుద్రూరు, జూలై 19 : రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ నేరస్తుడికి నాలుగు నెలల కఠిన కారాగా శిక్ష విధించిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.... 2023 సెప్టెంబరు 12వ తేదిన అర్ధరాత్రి రుద్రూరు మండల కేంద్రంలోని సులేమాన్‌నగర్ గ్రామంలోని అక్రమ్ మొబైల్ షాప్‌లో దొంగతనం చోటు చేసుకుందని, అప్పుడు 25 మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయని రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు కోటగిరి గ్రామం పోచమ్మ గల్లికి చెందిన వడ్డేడి గంగకృష్ణ (22)ను పట్టుకుని తన వద్ద నుంచి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని అప్పుడు జైలుకు పంపడం జరిగిందన్నారు.

ఈ కేసును విచారిస్తూ ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనల అనంతరం ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీసాయి శివ నిందితుడికి నాలుగు నెలల కఠిన కారాగార శిక్ష విధించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



క్యాంపు కార్యాలయంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తోట

మద్నూర్, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల కోసం అమలు చేస్తున్న పథ కాలను వారికి వివరించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇది రైతు ప్రభుత్వమని రైతులకు అన్ని విధాలుగా అండగా నిలబడి రైతులను రాజులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటి దాక మనం చేసిన పను లను భవిష్యతులో చేయబోయే పనుల గురించి ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలి పించుకునే విధంగా ప్రణాళికతో పని చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రం లోని రోడ్డు పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభ మవుతాయని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, శ్రీనివాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటూ..

పెద్దకొడప్‌గల్ : జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ శుక్రవారం బిజీగా గడిపారు. గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన రైతు రుణమాఫీ సంబరాలలో పాల్గొన్న తోట రాత్రి క్యాంపు కార్యాలయంలోనే నిద్రించారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్నాడని తెలుసుకున్న ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం రాగా వారి సమస్యలు వింటూ పరిష్కారం చేశారు. అనంతరం జుక్కల్ మండల కేంద్రంలో 4 కోట్ల 50 లక్షల రూపాయల ఎస్‌డీఎఫ్ నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ తాను జుక్కల్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గాన్ని రానున్న రోజులలలో అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపారు. ఇక తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పాలిట పక్షపాతిగా ఉండి ఏకకాలంలో రైతులకు సంబంధించిన రుణాలను మాపీ చేసి చరిత్రలో నిలిచారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి తన వాగ్దానాన్ని నెరవేర్చుకుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అస్పత్‌వార్ వినోద్, రమేష్ దేశాయ్, శివానంద్ పటేల్, విఠల్ పటేల్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం'

రుద్రూరు, జూలై 19 : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆగస్టు 15 లోగా రెండులక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి ప్రతి రైతును రుణవిముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారం, రుద్రూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోట అరుణ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు పార్వతి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు నడిపింటి నగేష్, మాజీ సొసైటీ చైర్మన్ పత్తి రాము, గౌస్, గోపాల్‌రావు, రవి, కార్తీక్, మాశెట్టి శ్రీను, సురేష్, సాయిలు, ఫయీమ్ తదితరులు పాల్గొన్నారు.

దోహాకత్తార్‌లో..

ఆర్మూర్‌రూరల్ : తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీని పురస్కరించుకొని దోహకత్తార్‌లో ఆలూర్ వాసులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయడం హర్షనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీని కూడా అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తిర్మన్‌పల్లి ప్రదీప్, తరుణ్, అనిల్, వివేక్, సూరి, అశోక్, కళ్యాణ్, బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ విఫలం

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 19 : రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతుందని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం విమర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు చేపడుతున్న సంబరాలు. రైతులను దగా చేసినందుకా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.15వేలు, రైతు భరోసా ఏమైందన్నారు. క్వింటాలుకు రూ.500 బోనస్, రైతు బీమా, అమలు కావడం లేదన్నారు. రుణమాఫీ కూడా అరకొర మంది రైతులకు కేవలం రూ.6వేల కోట్లు మాఫీ చేశారని, ఇంత మాత్రానికే సంబరాలు చేసుకోవడం హస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.31వేల కోట్లు ఒకేసారి రుణ మాఫీ అని ప్రకటన చేసి కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. తమ హయాంలో రాష్ట్రంలో రూ.లక్ష లోపు రుణాలు ఉన్న రైతులు 37 లక్షల మంది రైతులు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డు, లోన్ రీ షెడ్యూల్, ఐటీ పేరిట 26లక్షల మంది రైతులను తొలగించి ప్రస్తుతం 11 లక్షల మంది రైతులకు కుదించడం ఎంత వరకు సమంజసమన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రెండు సార్లు లక్షలోపు రుణాలు కలిగిన 5లక్షల 75వేల 177మంది రైతులకు రూ.2వేల518కోట్లు మాఫీ చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో 94వేల 566మంది రైతులకు రూ.459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు.

రైతులకు ఎవరు మేలు చేశారో గ్రహించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.7వేల చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, ఆగస్టు 15వ తేదీలోగా ఏలాంటి షరతులు లేకుండా అర్హులైన మొత్తం 60లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేషన్‌కార్డుల లేని రైతులకు మామిడి, నిమ్మ, బత్తాయి సాగు చేసే రైతులకు అవసరాలకు ఐటి కట్టే చెల్లించే రైతులకు చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రైతు రుణమాఫీ ఓ చరిత్ర : బోధన్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

భీమ్‌గల్ రూరల్, జూలై 19 : ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారంగా జిల్లాలో వేల కుటుంబాలకు లక్షలోపు రుణమాఫీ చేశారని, అదే విధంగా ఆగ స్టు 15 వరకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఐదేళ్ల ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా కష్టపడి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. అందరూ కలిసి బాధ్యతతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సహస్ర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన స్వాగత ర్యాలీ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లకు సన్మాన కార్యక్రమంలో భీమ్‌గల్ మండల కాంగ్రెస్ కార్యకర్తలు, నియోజక వర్గ కార్యకర్తలు, రైతులు ఘనస్వాగతం పలికారు. మొదటగా భీమ్‌గల్ పట్టణంలోని సుభాష్‌నగర్ ప్రధాన కూడలి వద్ద రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన ఈరవత్రి అనిల్, తెలంగాణ సహకార చైర్మన్ మానాల మోహ న్‌రెడ్డికి గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంగడిబజార్ నుంచి బస్టాండ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో లేకున్నా కార్యకర్తలు పడ్డకష్టాల ను మేము చూశామని, కష్టపడ్డ ప్రతికార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు ప్రతివ్యక్తికి న్యా యం జరుగుతందని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి, తాహెర్ బీన్ హందాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, వేణు, భీమ్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరెస్వామి, యూత్ అధ్యక్షులు నాగేంద్ర, నర్సయ్య జె.చంద్రునాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలను ఇప్పించాలని వినతి

నవీపేట : నాలుగు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను ఇప్పించాలని కోరుతూ అలీసాగర్, గుత్పఎత్తిపోతల కార్మికులు శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను కలిశారు. వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు వాపోయారు. అలీసాగర్ లిఫ్టులో పాముల బెడద విపరీతంగా ఉందని, తమకు రక్షణ పరికరాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఆర్టీవో అధికారులమని బెదిరించి..

పసుపు లారీ మళ్లింపు

● పోలీసుల అదుపులో నిందితులు



టాటాఏస్ వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

నవీపేట, జూలై 19 : నిజామాబాద్ మండలం సారంగాపూర్ గోదాం నుంచి గుంటూరు తరలివెళ్తున్న పసుపుకొమ్ముల లారీని ఈ నెల 17న గుర్తుతెలియని దుండగులు దారి మళ్లించారు. నవీపేట పోలీసులు, లారీఓనర్ వెంకటేశ్వర్ రావు తెలిపిన ప్రకారం.. నిజామాబాద్‌లో ఉన్న ఐటీసీ కంపెనీ నుంచి గుంటూరులో ఉన్న ఐటీసీ కంపెనీకి సుమారు 30 టన్నుల పసుపు కొమ్ములను తరలించడానికి ఈనెల 17న ఏర్పాటు చేసుకున్నారు. దీనికి సంబంధించి నిజామాబాద్‌కు చెందిన విజయ ట్రాన్స్‌పోర్ట్ వారు 14 టైర్ల లారీని బుక్‌చేసుకున్నారు. సాయంత్రం సమయంలో లారీ నిజామాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరగా ఇందల్వాయి సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు షిఫ్ట్ కారులో వచ్చి లారీని అడ్డగించారు. తాము ఆర్టీఓ అధికారులమని లారీ డ్రైవర్ రమేష్‌ను బెదిరించారు. ఈ విషయాన్ని డ్రైవర్ రమేష్ లారీ ఓనర్ వెంకటేశ్వర్‌రావుకు ఫోన్‌చేయగా లారీకి సంబంధించిన అన్ని పత్రాలు సరిగా ఉన్నాయని చెప్పాలని డ్రైవర్‌కు వివరించాడు. ఇదే సమయంలో వెంకటేశ్వర్ రావుతో దుండగులు ఫోన్‌లో మాట్లాడుతూ తాము ఆర్టీవో అధికారులమని తన పేరు సుబ్బారాయుడు అని పేర్కొన్నారు. జిల్లాలో సుబ్బారాయుడు అనే పేరుతో ఆర్టీవో అధికారులు లేరని వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని లారీని ముందుకు తీసుకెళ్లాలని డ్రైవర్‌కు చెప్పాడు. కాని డ్రైవర్ రమేష్ ఫోన్ స్విచ్ఛాప్ కావడంతో దుండగులు లారీ జీపీఎస్‌ను తొలగించి, లారీని మళ్లించారు. రాత్రి 8 గంటల సమయంలో లారీఓనర్ వెంకటేశ్వర్ రావు జీపీఎస్‌ను పరిశీలించగా తొలగించినట్లు గుర్తించాడు. లారీ కంపెనీకి చెందిన జీపీఎస్‌ను పరిశీలించగా లారీ గాంధారి ఎక్స్‌రోడ్డు నుంచి నిజామాబాద్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఈ నెల 18న జీపీఎస్‌ను పరిశీలించగా లారీ మండలంలోని జన్నేపల్లి వాగు పక్కనే ఉన్న పాత ఇనుప సామాన్ వద్ద నిలిపి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని నవీపేట పోలీసులకు సమాచారం అందించగా సంబంధిత లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో నుంచి 80 శాతం పసుపును నాలుగు టాటా ఏస్ వాహనాలలో తరలించినట్లు గుర్తించారు. ఇందులో నిజామాబాద్‌లోని గంజ్‌లో విక్రయించినట్లు తెలిసింది. మరో 120బస్తాలను నవీపేటలోని కెనాల్ కట్టపై ఉన్న ఓ గదిలో దాచి ఉంచగా సంబంధిత బస్తాలను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నవీపేట ఎస్‌ఐ యాదగిరి గౌడ్, నిజామాబాద్ ఒకటోటౌన్ ఏఎస్‌ఐ లాయక్ అలీలు స్వాధీనం చేసుకున్న టాటా ఎస్‌లను పరిశీలించారు. అనంతరం కెనాల్ కట్ట వద్ద దాచి ఉంచిన సుమారు 120 బస్తాల పసుపు కొమ్ములు, జన్నేపల్లి నుంచి తెప్పించిన పసుపు కొమ్ముల లారీలో ఎక్కించి జిల్లా కేంద్రానికి తరలించారు. లారీలో సుమారు 50 నుంచి 60 లక్షల రూపాయల విలువైన పసుపు ఉందని లారీ ఓనర్ పేర్కొన్నారు. జన్నేపల్లిలో పాత ఇనుప సామాన్ దుకాణం నడుపుతున్న నవీపేటకు చెందిన సోఫిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు నిజామాబాద్‌కు చెందిన షాదుల్ పరారీలో ఉన్నాడు. దీనికి సంబంధించి నిజామాబాద్ ఒకటోటౌన్‌లో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా లారీడ్రైవర్ రమేష్‌ను కూడా శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

బీడీ కార్మికుల జీవనభృతిని పెంచాలని ధర్నా



బీడీ కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న వి.ప్రభాకర్

కమ్మర్‌పల్లి, జూలై 19 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు బీడీ కార్మికులకు, టేకేదార్లకు, బీడీప్యాకర్లకు, మునీంలకు గంపలాగే కూలీలకు పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా 4వేల 16 రూపాయల జీవనభృతి అందించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మండల బీడీ కార్మికులతో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్ యూనియన్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ) ఐఎఫ్‌టీయూ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద నుంచి జాతీయరహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభార్ మాట్లాడుతు కార్మికులకు చేతినిండా పనిలేదు, బీడీలే ఆధారంగా జీవనం సాగిస్తున్న కార్మికుల ఆకు, తంబాకు చివరకు దారం సైతం కొని బీడీలు బర్తీ చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం జీవనభృతిని పెంచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 4వేల16 రూపాయలు సాధించేవరకు తమ పోరాటం కొనసాగిస్తునే ఉంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మూడు నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మికులకు 6వందల కూలీ పెంచాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు ఏడాదికి 12 వేల రూపాయలు అందజేయాలని ఆయన కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ)ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బీ.దేవారాం, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సారా సురేష్, మండల కార్యదర్శి బీ.అశోక్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల కార్యదర్శి జి.కిషన్, మండల పార్టీ నాయకులు వీ.బాలయ్య, వీ.ఆనంద్, వీ.రాధ, ఎస్.లక్ష్మీ, అరవింద్, పద్మ బీడీ కార్మికులు పాల్గొన్నారు.

అంక్సాపూర్ ఉన్నత పాఠశాల తనిఖీ



డీఈవో దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్, జూలై 19 : మండలంలోని అంక్సాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ సంద ర్శించారు. అందులో భాగంగా పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకా న్ని తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల పని తీరుపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలకు ఉపాధ్యాయులు సమయ వేళలు పాటించాలని సూచించారు. అనంతరం ఉపా ధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలలో ఉన్న విద్యార్థుల అవసరాలపై ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో వాడే పాత్రలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, కూరగాయలు తాజాగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా డీఈవో దుర్గాప్రసాద్‌ను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎంఈవో వనజారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వల తనిఖీ



రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

కోటగిరి, జూలై 19 : మండల కేంద్రంలోని బాలాజీ రైస్‌మిల్లుల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. బాలాజీ రైస్‌మిల్లులో గత మూడు సీజన్‌లలో కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైస్‌మిల్లులో ఉన్న నిల్వలతో పాటు బోధన్ మండలంలోని మినార్‌పల్లి గోదాంలో ధాన్యం బస్తాలను పరిశీలించారు. రైస్‌మిల్లుకు 69 వేల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా మినార్‌పల్లి గోదాంలో 67వేల క్వింటాళ్ల ధాన్యం, రైస్‌మిల్లులో 2వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. జిల్లాలో ధాన్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు రావడంతో 15 రైస్‌మిల్లులో తనిఖీలు కొనసాగుతున్నాయని ఓఎస్‌డీ పేర్కొన్నారు. ధాన్యం నిల్వలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కామారెడ్డి జిల్లా అధికారి నిత్యానందం, తహసీల్దార్ సునీత, ఎస్‌ఐ సందీప్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నిఖిల్ రాజ్, ఆర్‌ఐ హుస్సేన్ తదితరులున్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● నార్కోటిక్స్ అండ్ డ్రగ్స్ బ్యూరో ఏసీపీ సోమనాథం



మాట్లాడుతున్న ఏసీపీ సోమనాథం

మాక్లూర్, జూలై 19 : డ్రగ్స్ మాఫియా విద్యార్థులను టార్గెట్ చేసుకొని తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారని పట్టణాల నుంచి గ్రామాలకు ఇలాంటి వ్యసనాలకు వ్యాప్తించాయని, వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని నార్కోక్స్ అండ్ డ్రగ్స్ బ్యూరో ఏసీపీ సోమనాథం తెలిపారు. శుక్రవారం మండలంలోని దాస్‌నగర్ గ్రామ సమీపంలో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్‌తో పాటు హ్యూమెన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డ్రగ్స్ వల్ల కలిగే అనార్థలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితుల నుంచి, ఎలాంటి వస్తువులు తీసుకోవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సై సుదీర్‌రావు, కళాశాల అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేటు స్కూల్ బస్సు సీజ్

మెండోర, జూలై 19 : మండలంలో బుస్సాపూర్‌లో శ్రీపవన్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్‌బస్సును శుక్రవారం మోటర్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం జనరల్ సెక్రెటరీ దాయగ శేఖర్ మండలంలో ఫిటినెస్ లేని వాహనాలు, ఇతర జిల్లాలకు చెందిన ప్రైవేటు బస్సులను తీసుకువచ్చి అనుమతి లేకుండా నడుపుతున్నారని ఆరోపించారు. కాలం చెల్లిన బస్సును నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రైవేటుస్కూల్ బస్సులను అరికట్టి చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ఆర్‌టీఏ అధికారులకు విన్నవించగానే స్పందించిన మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి బస్సులను సీజ్ చేశారు. ఇతర జిల్లాల నుంచి బస్సులను తీసుకువచ్చి ఫిట్‌నెస్ లేకున్నా వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈత మొక్కలను సంరక్షించాలి

ముప్కాల్, జూలై 19 : నాటిన ప్రతీ ఈత మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎక్సైజ్‌శాఖ ఎస్సై స్టీవెన్‌సన్ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వనసంరక్షణలో భాగంగా మండల స్పెషల్ ఆఫీసర్ రసూల్‌బీతో కలిసి ఈతమొక్కలను నాటారు. గీత కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం ఈతవనాలను అభివృద్ధి చేస్తుందని, ఈత మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయా భాస్కర్‌రెడ్డి, ఏపీవో ఇందిరా, పంచాయతీ సెక్రెటరీ, గీత కార్మికులు పాల్గొన్నారు.

అధిక రసాయనాలు వాడితే అనర్థం

ముప్కాల్, జూలై 19 : రసాయానిక ఎరువులు అధికంగా వాడితే అనర్థమని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సైన్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండలంలోని ఎరువుల దుకాణాల్లో, సహకార సంఘాల్లో పరిధిలోని ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఎరువులను బిపాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని ఆయన హెచ్చరించారు. లేని లైసెన్స్‌లు రద్దుచేస్తామని హెచ్చరించారు. రైతుల అవసరం మేరకే యూరియా వాడాలని, అధికంగా వాడితే శాస్త్రీయ పెరుగుదుల జరుగుతుందని, చీడపీడలు ఆశిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ఏఈవో శ్రీకాంత్, నిశికాంత్, ఎరువుల దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

చేప పిల్లలను పంపిణీ చేయాలని వినతి

ముప్కాల్, జూలై 19 : ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేయాలని బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వంద శాతం సబ్సిడీతో గంగపుత్రుల జీవనోపాధి కోసం పంపిణీ చేస్తున్న చేపపిల్లలు కాంట్రాక్టర్‌లు నాసిరకంగా తేవడం ఆర్థికంగా నష్టపోతున్నామని గంగపుత్రులు అన్నారు. నాసిరకం చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారని, వాటి స్థానంలో కట్ల, బంగారు తీగా, మెరుగు, బంగారు తీగ, గ్యాస్‌కట్ లాంటి చేప పిల్లలను 35ఎంఎం, 80ఎంఎం సైజ్ పిల్లలు ఉండే విధంగా మెరుగైన చేపపిల్లలను అందజేయాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ప్రతాప్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవీపేట, జూలై 19 : మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన నగేష్, సతీష్‌లు బదిలీపై వెళ్లడంతో వారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గత 12 సంవత్సరాలుగా పాఠశాలలో సేవలందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో పాటు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను సైతం శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, సురేష్, జలేందర్, మోహన్, పోతన్న, తదితరులున్నారు.

బండరాళ్ల బ్లాస్టింగ్ నిలిపివేయాలి

నవీపేట, జూలై 19 : మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులో పొలం చదును పేరుతో కొందరు బండరాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్నారని వెంటనే సంబంధిత బ్లాస్టింగ్‌ను నిలిపివేసేలా చూడాలని గ్రామస్థులు కోరారు. పొలం మధ్యలో ఉన్న బండరాళ్లను బ్లాస్టింగ్ చేసి పగులగొడుతున్నారని దీంతో కొన్ని బండరాళ్ల ముక్కలు సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద పడుతున్నాయని వారు ఆరోపించారు. బ్లాస్టింగ్ రాళ్లతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే బ్లాస్టింగ్ పనులను నిలిపివేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై 19 : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు శుక్రవారం 17వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 67మంది విద్యార్థులకు గాను 60 మంది హాజరయ్యారని, ఏడుగురు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 113మంది విద్యార్థులకు గాను 106పరీక్షకు హాజరయ్యారని, ఏడుగురు విద్యార్థులు గైర్హాజ రయ్యారని ఆయన తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 8 మంది గైర్హాజర్

డిచ్‌పల్లి, జూలై 19 : విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1, 3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9వ సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు శుక్రవారం 4వ రోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయకళాశాలలో జరిగిన పరీక్షల్లో 14మంది విద్యార్థులకు గాను 14మంది పరీక్షకు హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 89 మంది విద్యార్థులకు 81 మంది విద్యార్థులు హాజరయ్యారని, 8 మంది గైర్హాజరయ్యారని డైరెక్టర్ పేర్కొన్నారు.

యానంపల్లిలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

డిచ్‌పల్లి, జూలై 19 : మండలంలోని యానంపల్లి ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ వారోత్సవాల సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి శుక్రవారం ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు రశీదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామాన్ సీనియార్టీతో ప్రతి ప్రైమరీ స్కూల్ పీఎస్ హెచ్‌ఎంను, 50శాతం ఫిట్‌మెంట్ పీఆర్సీ ప్రకటించాలని 4డీఏలను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ బాధ్యులు రాజేందర్ గౌడ్, నరేశ్‌చంద్ర, రమణ, నారాయణ, సుదర్శన్, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

రుద్రూరు, జూలై 19 : పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రుద్రూరు సమీకృత మండల కార్యాలయం ఆవరణలో ఆయన మొక్క లను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ పచ్చదనం పెంచేలా ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సాయిలు, ఏపీవో మనోహర్, టెక్ని కల్ అసిస్టెంట్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆపెక్స్ వైటల్ లయన్స్‌క్లబ్ సభ్యులు పావులూరి వెంకటేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని తట్టికోట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆదినారాయణ, జరుషా, అనిల్, పల్లెంపాటి శ్రీధర్, లంక రవి, లయన్స్ ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రుద్రూరు, జూలై 19 : మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్దిఖా ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎవరికైనా జ్వరం ఉన్నా, మలేరియా లక్షణాలు, చలిజ్వరం ఉన్నా వారికి అక్కడే ఆర్‌డీటీ (త్వరితగతిన మలేరియా పరీక్షలు) చేశారు. అదేవిధంగా కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, కాలనీవాసులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి అయేషా సిద్దిఖా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తీర్ణాధికారి డి.రాజేందర్, సూపర్‌వైజర్లు రవి, సుమతి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలత, ఆరోగ్య కార్యకర్తలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌నగర్‌లో పిడుగుపాటుకు కాలిన విద్యుత్ పరికరాలు

కమ్మర్‌పల్లి, జూలై 19 : మండంలోని ఆర్‌ఆర్‌నగర్ (రాజరాజేశ్వరినగర్) గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో పాటు పిడుగుపాటుకు పలు ఇండ్లలోని 5 టీవిలు, 20 సీలింగ్ ఫ్యాన్‌లు, 15 సెటప్‌బాక్స్‌లు, 5 ఫ్రిజ్‌లు కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. పిడుగుపాటు వల్ల హైవిద్యుత్తు ప్రసారం కావడంతో కాలిపోయినట్లు తెలిపారు. కాగా పిడుగుపాటుకు గ్రామంలో పలు వీధుల్లో విద్యుత్ దీపాలు సైతం కాలిపోయినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

పిప్రిలో విద్యార్థులకు టై, బెల్ట్‌ల వితరణ

ఆర్మూర్‌రూరల్, జూలై 19 : ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.గంగారెడ్డి టై, బెల్ట్‌లను వితరణ చేశారు. పాఠశాల విద్యార్థులందరికీ సమకూర్చిన టై, బెల్ట్‌లను ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

మోర్తాడ్, జూలై 19 : మండల చతురస్త్ర పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థి రిత్విక్ చెన్నైలో జరిగిన సౌత్‌ఇండియా చాంపియన్‌షిప్ పోటీలో అండర్-8 విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సదర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ ఎం.గిరి విద్యార్థిని సన్మానించి షీల్డ్‌ను బహుకరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ హామీ ఏమైంది'

ఏర్గట్ల, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు మరిచి రైతులకు విడతల వారిగా ఇస్తామనడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. రైతు బంధు ఎకరానికి 15 వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయకపోతే రెతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, నేరెళ్ళ లింగారెడ్డి, కట్కంసాగర్, రొక్కెడ మోహన్, నాయకులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

రెంజల్, జూలై19 : ప్రభుత్వం గంగపుత్రుల జీవనోపాధి కోసం వంద శాతం సబ్సిడీతో ఉచిత చేపపిల్లలను పంపిణీ చేస్తూ గంగపుత్రుల జీవనోపాధికి కృషిచేస్తున్న ప్రభుత్వానికి కాంట్రాక్టర్‌లు మాత్రం నాసిరకమైన తెలపియా (ప్లాంటెంట్) చేపపిల్లలను అందించడం వల్ల గంగపుత్రులకు తీవ్రనష్టం వాటిల్లుతుందని, దీనివల్ల గంగపుత్రుల జీవనోపాధి కష్టం అవుతుందని మండల అధ్యక్షుడు పాముల శంకర్ అన్నారు. ప్రభుత్వం గంగపుత్రులకు వందశాతం సబ్సిడీతో నాణ్యమైన చేపపిల్లలను ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగపుత్రులకు నాణ్యమైన చేపపిల్లలను అందించి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు మహిపాల్, గోపాల్, రాజన్న, సాయిలు, లక్ష్మయ్య, కిషన్, లక్ష్మణ్, పోశెట్టి, అనిల్, గోపి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

డిచ్‌పల్లి, జూలై 19 : మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ లెబర్‌కమిషనర్ యోహన్ శుక్రవారం డిచ్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ప్రజాపాలన కేంద్రాన్ని ఘన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో రవీందర్ ఉన్నారు.

బాడీఫ్రీజర్ అందజేత

డిచ్‌పల్లి, జూలై 19 : లయన్స్ సహార నిజామాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని యానంపల్లి గ్రామానికి బాడీఫ్రీజర్ అందజేసినట్లు లయన్స్ సహార ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో విండో చైర్మన్ రాంచందర్ గౌడ్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, బాడీఫ్రీజర్ దాత సూర్య భగవన్, ప్రతినిధులు నరసింహరావు, వీడీసీ సభ్యులు, అబ్బయ్య, గిరి, పాల్గొన్నారు. అనంతరం అందరు కలిసి మొక్కలు నాటారు.

చింతకుంట చెరువును పరిశీలించిన అధికారులు

మోస్రా, జూలై19 : మండలంలోని చింతకుంట గ్రామ శివారులో గల చెరువును కబ్జా చేస్తున్నారని గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి సోమవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా శుక్రవారం బోధన్ ఆర్డీఓ కార్యాలయం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీ.వెంకటేశ్వర్లు ఆర్డీవో ఆదేశాలతో గ్రామపెద్దల సమక్షంలో చెరువు పరిశీలించి దాని యొక్క పూర్తి విస్తీర్ణం 90.4ఎకరాలుగా గుర్తించామని తెలిపారు. ఇట్టి పూర్తి సర్వేను భూమి అంత బురదగా ఉన్నందున తడి ఆరిన తర్వాత పూర్తిస్థాయి సర్వేచేసి చెరువు యొక్క హద్దులు చూపుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బోధన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీ.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏఈ జీవన్, ఆర్‌ఐ ప్రకాష్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రషీద్, మాజీసర్పంచ్ లింగయ్య, గ్రామ హనుమాన్ కమిటీ అధ్యక్షుడు పోతారెడ్డి, పోతయ్య, సతీష్, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధన్ ఆసుపత్రిలో వైద్యుల బదిలీలు

బోధన్‌రూరల్, జూలై19 : బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నలుగురు వైద్యులు బదిలీ అయ్యారు. ఆసుపత్రి సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాహుల్, ఆర్‌ఎంవో డాక్టర్ అబ్దుల్ రహీం నిర్మల్ జిల్లా భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. డాక్టర్ బల్‌వీర్ సింగ్, అమృత్ రాంరెడ్డి భీంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు.

సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా బొగ్గుల రవీందర్

బోధన్‌రూరల్, జూలై 19 : బోధన్ కోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా బొగ్గుల రవీందర్ నియమితులయ్యారు. బోధన్ పట్టణం రాకాసిపేటకు చెందిన సీనియర్ న్యాయవాది బొగ్గుల రవీందర్‌ను సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారు. పదవీ బాధ్యతల్లో భాగంగా న్యాయవాది రవీందర్ బోధన్‌లో గల సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిల కోర్టులో ప్రభుత్వం తరపున కేసులను వాదించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా న్యాయవాది బొగ్గుల రవీందర్ మాట్లాడుతూ తనను సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమించినందుకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమర్థవంతంగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామన్నారు.

కౌమారదశపై విద్యార్థినులకు అవగాహన

వేల్పూర్, జూలై 19 : మండలంలోని రామన్నపేట్ గ్రామంలో శుక్ర వారం ఉన్నత పాఠశాలలో 8 నుంచి 10 వ తరగతికి చెందిన విద్యార్థినిలకు కౌమారదశపై అవగాహన కల్పించారు. వరల్డ్ సంస్థ మానిటరింగ్ కో-ఆరినేటర్ ఎస్.రాజు, కమ్యునిటీ కో-ఆర్డినేటర్ లావణ్యలు మాట్లాడుతూ బాలికలకు కౌమార దశలో వచ్చే మార్పుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆదరించిన వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి'

వర్ని, జూలై 19 : ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ తన ద్వారా సేవలు పొందిన వారు ప్రస్తుతం మరొకరి పంచన చేరడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు డీసీసీ డెలిగేట్ వై.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. వర్ని మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ నాయకులు ప్రతాప్‌సింగ్, శ్రీనివాస్ రెడ్డితో కలిసి మాట్లాడారు. 2019 ఎన్నికల్లో తన సహచరుడిగా ఉన్న రాజిరెడ్డి అధిష్టానం టికెట్ ఇచ్చే తరుణంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు అడ్డుకున్న సంగతి గుర్తుచేసుకోవాలన్నారు. అదే రాజిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలరాజును కలుపుకుని ఎమ్మెల్యే పోచారం చెంతన చేరడం ఏంటని ప్రశ్నించారు. పార్టీలో ఎన్నివర్గాలు సృష్టించినా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి నాయకత్వంలోనే విజయం సాధిస్తారన్నారు. సమావేశంలో మంత్రి గణేష్, బాలకృష్ణ, రెడ్డి రాంబాబు, గంగాప్రసాద్, భజ్యానాయక్, గంగప్ప పాల్గొన్నారు.

బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా శంకర్

బోధన్‌రూరల్, జూలై 19 : బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ సెలవుల్లో ఉండగా ఆయన స్థానంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్ బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ రాజశ్రీ


డాక్టర్ రాజశ్రీ

పెద్దబజార్, జూలై 19: జిల్లా వైద్యశాఖాధికారిగా డాక్టర్ రాజశ్రీ నియామకమయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన డాక్టర్ తుకారం రాథోడ్ ఆర్మూర్‌కు బదిలీ అయ్యారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ హైదరాబాద్‌లోని చార్మినార్ జోన్ నుంచి వచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది సైతం బదిలీ అయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా జీజీహెచ్‌లో పనిచేస్తున్న పలు వురు ఉన్నతాధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు వారి స్థానంలో కొత్తవారు చార్జి తీసుకోనున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర బదిలీ అయ్యారు. ఆమె హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి వెళ్లనున్నారు. ఆమె స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. మెడికల్ కాలేజీ నుంచి 18మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సైతం బదిలీ అయ్యారు. అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, ఆఫీస్ సూపరిం టెండెంట్ రాజేంద్రప్రసాద్‌లు బదిలీ అయ్యారు. రమాదేవి నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి, సంతోష్‌కుమార్ ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి, రాజేంద్రప్రసాద్ జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. మరో ముగ్గురు ప్రొఫెసర్లు సైతం బదిలీలు కానున్నారు. కొత్తవారు చార్జి తీసుకున్న తర్వాత బదిలీ అయిన వీరు రిలీవ్ కానున్నారు. ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ పోచంపాడ్‌కు బదిలీ అయ్యారు.

హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 19: నగరంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం నగరంలోని ప్రధాన హోటళ్లు అయిన లహరి ఇంటర్నేషనల్, కపిల హోటల్‌లో మున్సిపల్ కమీషనర్ మందమకరంద్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి తనిఖీలు కొసాగాయి. మొదటగా కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లోగల ప్రముఖ స్టార్ హోటల్ లహరి ఇంటర్నేషనల్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించి 5వేలు జరిమానా విధించారు. అనంతరం నిత్యం రద్దీగా ఉండే కపిల హోటల్‌లో తనిఖీలు నిర్వహించి 15వేలు జరిమానా విధించారు. నిబంధనలు పాటించకుండా కిచెన్‌లో శుభ్రత లేకపోవడంతో జరిమానాలు విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ అధికారి నరేందర్, సానిటరి ఇన్స్‌పెక్టర్ నటరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభం

సుభాష్‌నగర్, జూలై 19: నగరంలోని డివిజన్-20లో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ దండు నీతూకిరణ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. నగరంలోని లాల్‌బహద్దూర్ శాస్త్రి పార్క్‌ను ప్రారంభించి డ్రైనేజీ, సీసీరోడ్లు, ప్యాచ్‌వర్క్, కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని నగరాన్ని సుందరీకరణ చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ న్యాలంరాజు, కాలనీ అధ్యక్షుడు శంకర్, కృష్ణారావు, లక్ష్మణ్, జలపతిరావు, రాజన్న, సురేందర్‌రెడ్డి, రవిబాబు, వెంకటేశం, సుందర్‌రాజు, ఓంప్రకాశ్, గోకుల్‌సింగ్, బలరాం పాల్గొన్నారు.

'రాజధాని' ధరతో గరుడ ప్లస్ ప్రయాణం

సుభాష్‌నగర్, జూలై 19: నిజామాబాద్ నుంచి సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల కోసం ఆర్టీసీ మరో సౌకర్యాన్ని కల్పించింది. రానుపోను ప్రయాణించేవారికి ఒకేసారి టిక్కెట్ బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పించిన ఆర్టీసీ యాజమాన్యం మరో ఆఫర్‌ను ప్రకటించింది. రాజధాని ధరతోనే గరుడ ప్లస్‌లో ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూలై 19: నగరంలోని శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర టౌన్ ఏడీఈలు చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశంలు తెలిపారు. శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. నగరంలోని పవర్‌హౌజ్ తిలక్‌గార్డెన్, దుబ్బ, మిర్చికంపౌండ్, వినాయక్‌నగర్, బోర్గాం(పి), ముబారక్‌నగర్, సుభాష్‌నగర్, అర్సపల్లి, గూపన్‌పల్లి, కంఠేశ్వర్, విద్యుత్‌నగర్, లహరి ఇంటర్నేషనల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేయాలి

ఇందల్వాయి, జూలై 19: ప్రభుత్వం గంగపుత్రుల జీవనోపాధి కోసం ప్రతీ సంవత్సరం వంద శాతం సబ్సిడీతో ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందని కానీ కాంట్రాక్టర్లు నాసిరకమైన పాంప్లెంట్, తేలేపియా వంటి చేపపిల్లలను పోయడం వల్ల గంగపుత్రులకు తీవ్ర నష్టం వాటిళ్లుతుందని దీంతో గంగపుత్రులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం దృష్టిసారించి రవ్వాట, కట్ల, బంగారుతీగ, మెనుగు, యాస్కర్ వంటి చేపిల్లలను అందించి గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ తహసీల్దార్ వెంకట్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి మండల గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


మోపాల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


రావుట్లలో..

మోపాల్, జూలై 19: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఒకేసారి రెండులక్షల రూపాయల రుణమాఫీ చేయడం పట్ల శుక్రవారం మండల కేంద్రంలోని మంచిప్ప, బోర్గాం(పి) ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంచిప్పలో ఏఎంసీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, ఆయా గ్రామాల నాయకులు బున్నెరవి, మోహన్, బోర్గాం(పి)లో సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, పాలకవర్గం డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసినందుకు రావుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్ల ఎర్రన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పంటరుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సామెల్, రమేష్, రాజేందర్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: రైతులకు రుణమాఫీ చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేయడం పట్ల రైతులు సంబురాలు జరుపుకుంటున్నారు. శుక్రవారం రూరల్ పరిధిలోని పలు గ్రామాలతో పాటు విలీన గ్రామాలైన ఖానాపూర్, గూపన్‌పల్లి, సారంగపూర్, ముబారక్‌నగర్‌లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఖానాపూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొర్వ లలిత క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నేతలు కొర్వ గంగాధర్, కొర్వ రాజేంద్రప్రసాద్, సాలుగారి సాయన్న, కొర్వ కోటయ్య, దాసరి ఒడ్డెన్న, అగ్గు భోజన్న, శ్రీధర్, సంజీవ్‌రెడ్డిలు ఉన్నారు.

ఏబీసీ సెంటర్ పరిశీలన

సుభాష్‌నగర్, జూలై 19: నగరంలోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మందమకరంద్, మేయర్ దండు నీతూకిరణ్‌లు పరిశీలించారు. శుక్రవారం నగరంలోని ఏబీసీ సెంటర్‌ను పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు గురిచేస్తున్న వీధి కుక్కల స్వైర విహారం నుంచి నగర ప్రజలను కాపాడటానికి ఐదు సంవత్సరాలుగా వీధి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సంతాన ఉత్పత్తి కలుగకుండా నియంత్రణకు కృషి చేస్తున్నామని అన్నారు. వీధి కుక్కల బెడద సమస్య ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220234 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, ఇంచార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ, ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవ కేంద్రం ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, జూలై 19: ప్రజల సౌకర్యార్థం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటికే మున్సిపల్ పట్టణాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అన్నారు. అయితే వివిధ పనుల నిమిత్తం సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించేందుకు అనునిత్యం కలెక్టరేట్ వచ్చేవారి కోసం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉంచాలనే దీన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలోని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర పథకాలకు అర్హులైన ప్రతీ కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న అర్హులైన దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలని ఆయన సూచించారు. కలెక్టరేట్‌లోని సేవా కేంద్రం ప్రభుత్వ కార్యాలయాల పనిదినాల్లో ఉదయం 10.30ల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో అందుబాటులోకి తెచ్చిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డేటా సవరణ కోసం వచ్చే దరఖాస్తుదారులు తమవెంట రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నెంబర్ తీసుకొని రావాలన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ కార్తిక్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

ఇందల్వాయి, జూలై 19: ఆర్థికంగా, సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన ముదిరాజ్ యువత భవిత కోసం ముదిరాజ్‌లను బీసీ-డి నుండి బీసీ-ఏలోకి మార్చాలని శుక్రవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు మెతుకు శివ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ పిలుపు మేరకు ఈనెల 15 నుండి 20 వరకు జరిగే దశల వారి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతీముదిరాజ్ బిడ్డ బాధ్యతాయుతంగా కదిలివచ్చి తమ తమ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శుక్రవారం ఇందల్వాయి తహశీల్దార్ కార్యాలయంలో బీసీ-డి నుండి బీసీ-ఏలోకి మార్చాలని వినతిపత్రం అందజేయడం జరిగిందని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాన్ని పరిగణలోకి తీసుకొని ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు తెలుపుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం విభాగం సభ్యులు శ్రీనివాస్, ఇందల్వాయి ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మొచ్చగోపాల్, ఎర్రసాయిలు, గంగాధర్, నడిపి గంగారాం, కిషన్, గంగాధర్, మచ్చ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


చెక్కును అందజేస్తున్న దృశ్యం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో కిసాన్ దివాస్

నిజామాబాద్ అర్బన్, జూలై 19: నిజామాబాద్ నగరంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో శుక్రవారం కిసాన్ దివాస్ నిర్వహించారు. వ్యవసాయ రుణాలతో పాటు డ్వాక్రా గ్రూపులకు 1.15 కోట్ల రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ మేనేజర్ ప్రసాద్ బిస్వాల్, చీఫ్ మేనేజర్ సరత్‌కుమార్ నాయక్, సీనియర్ మేనేజర్‌లు వంశీనాథ్‌గౌడ్, శంకర్, బ్యాంకు ప్రతినిధులు అశోక్ చౌహాన్, శోభారాణి, హారికలు పాల్గొన్నారు. బ్యాంకు ఎప్పుడూ రైతులకు, మహిళలకు అందుబాటులో ఉండటంతో పాటు వారి శ్రేయస్సే లక్ష్యంగ పనిచేస్తుందని జోనల్ మేనేజర్ ప్రసాద్ బిస్వాల్ అన్నారు. బ్యాంకు స్థాపించినప్పటి నుంచి అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటూ వారి వ్యాపారాలను వృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

ఖిల్లా, జూలై 19: నగరంలోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక్‌నగర్‌లో రెండు రోజుల క్రితం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివరాలను శుక్రవారం నగర ఇన్స్‌పెక్టర్ నరహరి తన ఛాంబర్‌లో విలేకరులకు వెల్లడించారు. వినాయక్‌నగర్ మురళి హోటల్ సమీపంలో బుధవారం హత్య చేసిన నిందితుడు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ఆధారంగా వివరాలను సేకరించడం జరిగిందన్నారు. అమ్మ వెంచర్ వద్ద డెయిరీఫాం సమీపంలో సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వంశీ వినాయక లిక్కర్ మార్ట్‌లో మద్యం తాగుతుండగా సాయికుమార్ మూత్రవిసర్జనకు వెళ్లగా అతని వెనకే మృతుడు ఆనంద్ బిహార్ వెనకాల నుంచి నెట్టి వేయగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. అనంతరం మద్యం తాగిన తర్వాత ఇద్దరు గొడవ పడగా సాయికుమార్ ఆనంద్ బిహారి పాండేను బండరాయితో తలపై తీవ్రంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే వెళ్లకిలాపడి మృతి చెందినట్లు తెలిపారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసును ఛేదించడం జరిగిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై పాండేరావు, ఏఎస్సై సాయిలు, సిబ్బంది మనోజ్, అనీల్, బాలాజీ, భూరజ్, సంగేష్, నారాయణ, రవిరమేష్, రాకేష్‌లు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో ఈత వనాల పెంపకం

ధర్పల్లి, జూలై 19: భీంగల్ సర్కిల్ పరిధిలోని ప్రతీ గ్రామంలో ఈత వనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు భీంగల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోగల ఊరచెరువు కట్టపై ఈతమొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈతవనాల పెంపకం కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు ఆయన చెప్పారు. ప్రతీ నర్సరీలో ఈత మొక్కలను పెంచుతున్నట్లు అయన పేర్కొన్నారు. గీత కార్మికుల కోసం ఈత వనాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీవో బాలకృష్ణ, ఏపీవో వినోద, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ కర్కగంగారెడ్డి, గంగాధర్‌గౌడ్, చెలిమెల శ్రీనివాస్, ఈవో సైఫొద్దీన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


గోదాంను పరిశీలిస్తున్న చైర్మన్ అన్వేష్‌రెడ్డి

తెలంగాణ సీడ్స్‌ను తనిఖీచేసిన చైర్మన్

నిజామాబాద్ రూరల్, జూలై, 19: సారంగపూర్‌లోని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ (టీఎస్ సీడ్స్) కార్యాలయాన్ని కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి నిజామాబాద్‌లోని కార్యాలయానికి చైర్మన్ అన్వేష్‌రెడ్డి వచ్చారు. చైర్మన్‌కు సీడ్స్ రీజనల్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం సంస్థ కార్యాలయాన్ని, విత్తన గోదాంలను చైర్మన్ అన్వేష్‌రెడ్డి తనిఖీచేశారు. సీడ్స్ గోదాంలలో నిల్వచేసిన ధాన్యాన్ని చూశారు. యాసంగి సీజన్ 2024-25 సీజన్‌కు సంబంధించిన విత్తనోత్పత్తి, సీడ్ యాక్షన్ ప్లాన్‌ను రీజనల్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి చైర్మన్‌కు వివరించారు. శనగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. వరి వంగడాలతోపాటు అపరాలు ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలు రైతులకు అందించాలన్నారు. సంస్థ కార్యాలయంలో విత్తనాల సబ్సిడీ ధరల పట్టికను సైతం చార్టును అందరికి తెలిసేలా బహిరంగంగా ఉంచాలని సూచించారు. రైతుల అవసరాల మేర సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలు సిద్ధంగా ఉంచాలని, అధికారులు, సిబ్బంది ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని తక్షణమే పరిష్కరిస్తానని సిబ్బందికి చైర్మన్ హామీ ఇచ్చారు.

జీపీ, ఏజీపీల నియామకం

నిజామాబాద్ లీగల్, జూలై 19: జిల్లా కోర్టులో అధికార యంత్రాంగం కోసం తాత్కాలిక జీపీ, ఏజీపీలను నియమిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర న్యాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది వెంకట్‌రమణాగౌడ్, అసిస్టెంట్ ప్లీడర్‌గా పి.రాజులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులలో జిల్లా ప్రభుత్వ అధికార యంత్రాంగం తరఫున న్యాయవ్యవహారాలు నిర్వహిస్తారు. అదే విధంగా ఏజీపీ రాజు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో జిల్లా ప్రభుత్వ అధికార యంత్రాంగం తరఫున సివిల్ కేసుల లో న్యాయవ్యవహారాలను నిర్వహిస్తారని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు మంతాని రాజేందర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ పంప్‌హౌజ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ఇందల్వాయి, జూలై 19: మండల కేంద్రంలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన మిషన్‌భగీరథ మంచినీటి ప్రాజెక్టును నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్‌భగీరథ ద్వారా ప్రతీ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని అధికారులకు సూచించారు. మిషన్‌భగీరథ నీటి ద్వారానే ప్రజలకు మంచినీరు అందుతుందని ప్రభుత్వం ఎంతో కష్టపడి ప్రతి గ్రామంలో సాగునీటి సమస్య తీర్చేందుకు మిషన్‌భగీరథ ద్వారా నీటిని అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, భైరయ్య, కిషన్, మోతిలాల్ ఉన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల్లో కుళ్లిన కూరగాయలు

- డీఈవోకు ఫిర్యాదు చేసిన పీడీఎస్‌యూ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 19: నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలో కుళ్లిన కూరగాయలతో భోజనం వండి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. పాఠశాలను సందర్శించినప్పుడు కిచెన్‌లో ఉన్న కుళ్లిన కూరగాయల ఫొటోలు తీసి ఈ సందర్భంగా డీఈవోకు చూపించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల మెస్‌లో కూరగాయలు కుళ్లిపోయి ఉన్నాయని వాటినే వంట చేసి పిల్లలకు పెడుతూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై విద్యాసంస్థల ఇంచార్జితో ఫోన్‌లో సంప్రదించగా అలాంటిది ఏమీ లేదని కొన్ని కూరగాయలు మాత్రం కుళ్లిపోగా వాటిని బయట పడేసామని విద్యార్థి సంఘాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు.

బస్టాండ్‌లలో మౌలిక సదుపాయాలు

ధర్పల్లి, జూలై 19: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోగల బస్టాండ్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యతను స్థానికంగా ఉండే కంట్రోలర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రతీ బస్టాండ్‌లో విద్యుత్, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆనంద్, కంట్రోలర్ గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సుభాష్‌నగర్, జూలై 19: నగర పాలక సంస్థలో కుక్కల బెడద కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ మంద మకరంద్ తెలిపారు. కుక్కల బెడద ఉన్నట్లయితే 08462-220234 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. నగర ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులోకి చెట్లను నరికే నూతన పరికరం

సుభాష్‌నగర్, జూలై 19: విద్యుత్ తీగలపైన చెట్లను నరికేందుకు విద్యుత్ శాఖ అధికారులు ఆపసోపాలు పడుతుంటారు. నెలలో చివరి శనివారం విద్యుత్ తీగలపైన చెట్లను నరికేందుకు ప్రత్యేకంగా మనుషులను ఏర్పాటు చేసి చెట్ల కొమ్మలను నరికివేస్తుంటారు. ఈ ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ నుంచి చెట్లను నరికే నూతన పరికరాన్ని తీసుకువచ్చారు. టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో డివిజన్‌కు ఒకటి చొప్పున నాలుగు డివిజన్‌లకు నాలుగు పరికరాలను సంస్థ అందించింది. దీన్ని పనితనాన్ని శుక్రవారం టౌన్-2 ఏడీఈ తోటరాజశేఖర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. సీపీ క్యాంప్ కార్యాలయం పక్కన విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను నరికివేశారు. దీంతో విద్యుత్ అధికారులకు పని సులువు కానుంది.

నగరంలో పట్టపగలు దొంగతనం

ఖిల్లా, జూలై 19: నగరంలోని ప్రగతినగర్ దేవిటాకీస్ సమీపంలో పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బందెల శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్‌గా పనిచేస్తున్న ఆయన భార్య ఇద్దరు విధులకు వెళ్లారు. ఇంట్లో ఉంటున్న శ్రీనివాస్ అమ్మ ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లింది. దీనిని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోగల 4లక్షల 50వేలు నగదు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు తాళం పగలగొట్టి ఉండటంతో పాటు బీరువాలో గల నగదు, బంగారం దొంగతనానికి గురైనట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నాల్గవ టౌన్ ఎస్సై పాండేరావు సిబ్బందితో చేరుకొని వివరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగరంలోని లాడ్జిల్లో విస్తృత తనిఖీలు

ఖిల్లా, జూలై 19: పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని పలు లాడ్జిలను తనిఖీలు చేశారు. లాడ్జిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా వాటిని నిరోధించడానికి ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సురేష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత, నగర సీఐ నరహరి, నాల్గవ టౌన్ ఎస్‌హెచ్‌వో పాండేరావు, సిబ్బంది పాల్గొన్నారు.